# అసలు రంగులు

-యం.నాగలక్ష్మి

భాగ్యనగరానికి పొలిమేరల్లో వున్న స్టార్ హోటల్ అది. ఒకవైపువున్న ప్రవేశద్వారం దగ్గర అరటిచెట్లు పాతి తోరణాలు కడుతున్నారు. అసలు రాత్రే అన్ని ఏర్పాట్లు చేసి ఉండాల్సింది. కానీ రాత్రి ఒకటే గాలి తర్వాత వాన. పొద్దున కూడా వాన కురవడంతో లేటయింది తోరణాల పని.

''తొందరగా కానివ్వండి. ఇంక గెస్ట్స్ వచ్చే టైమవుతోంది'' ఈ ఏర్పాట్లు చూసుకుంటున్న రవికుమార్ పనివాళ్ళని హడావుడి పెట్టాడు.

సూర్యుడు తన ప్రకాశాన్ని ఎవరూ అడ్డుకోలేరు సుమా అన్నట్లు మబ్బుల్లోంచి బయటపడి తన కిరణాలు నాలుగువైపులా వెదజల్లాడు.

అరటిచెట్లమీదుగా బ్యానర్ కడుతున్న పన్నెండేళ్ళ నర్సిగాడు దానిమీద ఏం రాసారని పక్కనున్న ఎలక్ట్రీషియన్ని అడిగాడు.

''సంబరాల రాంబాబు శతదినోత్సవ సంబరాలు'' ఎలక్ట్రీషియన్ దాని అర్థం కూడా విడమర్చి చెప్పాడు.

''గదా సంబడం...ఆ సిన్మ జూపిస్తరా'' మళ్ళీ ఆశగా అడిగాడు నర్సిగాడు.

''లేదురా...''

'అంతకంటే మంచి సిన్మా చూపిస్తారు' అటువైపునుంచి లోపలికి వెళ్తున్న ఓ పత్రికా విలేకరి లోపల అనుకున్నాడు.

కార్లు వచ్చి ఆవరణ అంతా నింపడం మొదలుపెట్టాయి.

ఫోటోగ్రాఫర్లు, విలేకరులూ డేగకళ్ళతో నాలుగువైపులా గమనిస్తూ క్లిక్‌మనిపిస్తున్నారు. నోట్ చేసుకుంటున్నారు.

ఓ గంటలో రావాల్సిన వాళ్ళంతా వచ్చేసారు.

వేదికమీద దర్శక నిర్మాతలతోపాటు ఆ చిత్రం హీరో రంజిత్, హీరోయిన్ ఉజ్వల కుర్చీల్లో ఆసీనులయ్యారు.

రంజిత్, ఉజ్వల పక్క పక్క కుర్చీల్లో ఒక్కక్షణం పళ్ళు నూరుకుని మరుక్షణం ఒకళ్ళవైపు ఒకళ్ళు చూసుకుంటూ ఫక్కున నవ్వేశారు ఏదో పెద్ద జోక్ వేసినట్లు.

ఫోటోగ్రాఫర్లు క్లిక్‌క్లిక్ మనిపించారు యధావిధిగా.

శతదినోత్సవ వేడుకలు మొదలయింది. ఆహ్వానితులకి స్వాగతం పలికి సినిమా విజయవంతంగా వందరోజులు ఆడడానికి కారకులైన ప్రేక్షకులకి కృతజ్ఞతలు చెప్పుకుని సినిమా యూనిట్‌కే, నటీనటులకీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపాడు నిర్మాత.

''ఈ సినిమా నిర్మాణ సమయంలో మేమంత ఒక కుటుంబ సభ్యుల్లా ఎంతో సరదాగా అరమరికలు లేకుండా గడిపాం. చిత్రం ఇంత విజయవంతమవడానికి అదే కారణం'' దర్శకుడు చెప్పుకుపోతున్నాడు.

'హీరో ఎడమొహం, హీరోయిన్ పెడమొగం. హీరోకి, విలన్‌కి సినిమాల్లోనే కాకుండా బయట కూడా పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది. వీళ్ళని ఓ చోట చేర్చి పని చేయించడం నా చావుకొచ్చింది. ఛీ...వీళ్ళున్న సిన్మాని మళ్ళీ ఛస్తే దర్శకత్వం చేయకూడదు.'

''నిర్మాతగారు ఈ చిత్ర నిర్మాణంలో ఎంతో ఇదిగా ప్రోత్సహించారు. ఆయన అవకాశం ఇస్తే తర్వాత చిత్రానికి కూడా నేనే దర్శకత్వం వహించాలని నా కోరిక.''

'పిసినారి పేరయ్య. స్విట్జర్లాండ్ అయినా, ఊటీ అయినా ఒకటేనంటాడు. డాల్‌లేక్ ఎందుకు? మన అల్వాల్ లేక్ దానికేం తీసిపోయిందీ అంటాడు. అర్థణాకి కానీకి కూడా ఒకటే లెక్కలు. ఈయన సిన్మా ఇంకెప్పుడూ చెయ్యకూడదు.'

''ఈ సిన్మా ఇంత బాగా విజయవంతమవడానికి రంజిత్‌గారు నేను కొత్త అమ్మాయినని నెగ్లెక్ట్ చేయకుండా ఎంతో ప్రోత్సహించడమే కారణం. రంజిత్‌గారితో మరిన్ని చిత్రాల్లో నటించే అవకాశం వస్తుందని ఆశిస్తున్నాను.''

'కొత్తదాన్నికదా అని హీరో తన పాత్ర నిడివి పెంచుకుని తన పాత్ర కుదించాడు. హీరోయిన్ అన్న మాటేగానీ మొత్తం సినిమాలో పట్టుమని పదిసీన్లు లేవు. ఇలాంటి హీరోతో మళ్ళీ పిక్చర్లు ఒప్పుకోకకూడదు. అసలు ఈ సిన్మా తీస్తుండగానే ఇంకో దర్శకుడు తమిద్దరితో తనో చిత్రం తీస్తానన్నాడు. హీరో రంజిత్ అయితే నేను చేయను. హీరోని మారిస్తేనే నటిస్తానని కచ్చితంగా చెప్పేసింది.'

రంజిత్ ఉజ్వలకి ఓ మెమెంటో అందించాడు. ఉజ్వల సుతారంగా దాన్ని అందుకుని అంతకంటే సుకుమారంగా రంజిత్ బుగ్గమీద చిరుముద్దిచ్చింది. ఫోటోగ్రాఫర్ల కన్నుల పండుగగా క్లిక్ క్లిక్ మనిపించారు.

''ఫీల్డ్‌కి కొత్త అయినా ఉజ్వల ఎంతో ఉజ్వలంగా నటించింది. సక్సెస్‌ఫుల్ జంటగా మేము మరిన్ని చిత్రాల్లో నటించే అవకాశం వస్తుందని ఆశిస్తున్నాము.''

'ఈ పిల్లకి నవ్వుకీ ఏడుపుకీ తేడా తెలియదు. హీరోయిన్ చెలికత్తె కింద కూడా పనికిరాదు. ఈ ఏడుపుమొహాన్ని ఎక్కడనుంచి తెచ్చారండీ బాబూ?'

సంగీత రచయితకి శాలువా కప్పి మెమెంటో అందించాడు దర్శకుడు.

'ఛీ...ఇవి పాటలా? నాలుగు మాటలు రిధమ్ కుదిరిందికదాని ఒక్కచోట చేరిస్తే పాటవుతుందా?'

''ఈ చిత్రంలోని పాటలు ఇంతలా రాష్ట్రం నలుమూలలా మార్మోగిపోవడానికి చక్కటి పాటలకి ఎంచక్కటి వరుసలు కట్టిన సంగీత దర్శకులు పానకాలేశ్వరరావుగారు పాటల్లో



కురిపించిన పానకమే కారణం'' నిర్మాత ఆయన కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ శాలువా కప్పి మెమెంటో అందించారు.

'ఈ పిల్లికూతలగాడిని ఎక్కడనుంచి పట్టుకొచ్చారయ్యా బాబూ? వీడి కూతలు పెట్టే బదులు పాటలులేని సినిమా తీస్తే బావుండేదేమో?'

సినిమా నిర్మాణంలో సహాయపడ్డవారందరికీ మెమెంటోలు అందజేస్తున్నారు.

క్లాప్‌బాయ్‌లు, లైట్‌బాయ్‌లు, అసిస్టెంట్లు కొందరు వెనుక కూర్చుని, కొందరు సైడ్‌న నుంచుని ఈ వేడుకలు చూస్తున్నారు.

సినిమాల్లో ఎలాగైనా చేరిపోవాలని ఇంట్లోంచి పారిపోయి వచ్చి సంబరాల రాంబాబు సినిమా మొదలుపెట్టినప్పటినుండీ యూనిట్‌లో వుంటూ అందరి పనులూ, అన్ని పనులూ చేస్తూ వచ్చిన రవికుమార్ 'అమ్మో! ఈ సినిమా మాయా ప్రపంచం అయితే, ఈ సినిమా వాళ్ళు మాయావులకేం తీసిపోరు. రంగులు మార్చడం ఊసరవెల్లి వీళ్ళ దగ్గరనుంచి నేర్చుకోవాల్సిందే'' అనుకున్నాడు.

★